

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

**తెలియకుండానే** రోజులు వేగంగా గడిచిపోయాయి. చూస్తూండగానే క్లాసులు, హోంవర్క్స్, లాబ్‌లో పనితో రోజులు వెళ్ళిపోయాయి. నా థీసిస్ గురించి ప్రెజెంటేషన్ ఇవ్వమని చెప్పారు. ఎప్పుడో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ప్రాజెక్ట్ తప్ప వేరే ప్రెజంటేషన్ ఎప్పుడూ ఇవ్వలేదు. థీసిస్ కన్నా ప్రెజంటేషన్ గురించి ఎక్కువ భయం కలిగింది. రెయిన్‌కి ఈ విషయం చెప్పాను. తను ఇచ్చిన మొదటి ప్రెజంటేషన్ నాకు పంపి అదే రీతిలో స్లైడ్స్‌ని ముందు తయారు చెయ్యమంది. రెండు రోజులు కష్టపడి తయారు చేసి రెయిన్‌కి చూపించాను. బానే ఉందని చెప్పింది. ఎందుకైనా మంచిదని నేహాకి కూడా చూపించాను. చాలా మార్పులు చేసి, ఎందుకు చేసిందో వివరించింది. తరవాత ప్రొఫెసర్‌కి చూపించమంది.

మర్నాడు ఆఫీస్ అవర్స్‌లో ప్రొఫెసర్‌కి చూపించాను. ఆయన ప్రింట్ చేసి స్లైడ్స్‌ని ముందుకి వెనకకి తిప్పుతూ చాలాసేపు చూసి పెన్ తీసారు. నా గుండె చప్పుడు చెవికి వినబడింది. ఆయన నన్ను గమనించి చిన్నగా నవ్వారు.

"డోంట్ బీ నెర్వస్" అన్నారు. నేను ఏమీ మాట్లాడలేదు. కరెక్షన్స్ చాలా చెప్పి అవి చేసాక ఈ మెయిల్ చెయ్యమన్నారు. వెంటనే లాబ్‌కి వెళ్ళి అవి పూర్తి చేసాను. ఈలోపు నాలుగు గంటలు గడిచిపోయాయి, ప్రతి ప్రెజంటేషన్‌కి ఇంతసేపు పడితే నిద్రమాని రోజులు గడపాల్సి వస్తుందని వెన్నెలకి చెప్పాను. చేస్తూ చేస్తూ వుంటే అలవాటైపోతుందని, కొన్నిరోజుల్లో గంటలో మొత్తం తయారు చెయ్యగలుగుతానని చెప్పింది. అది విని కాస్త ధైర్యం కలిగింది.

ప్రెజంటేషన్‌కి మా ప్రొఫెసర్‌తోపాటు లాబ్‌లో పనిచేసేవారందరూ ఉన్నారు. ఎంతో దడగా అనిపించింది. కాళ్ళు వణికాయి. అందరూ కొంచెం సేపు మాట్లాడుకున్నాక నన్ను మొదలు పెట్టమన్నారు. వాళ్ళు మాట్లాడుకుంటూ టై అవగొట్టేయొచ్చుకదా అనుకున్నాను. నా గొంతులో వణుకు స్పష్టంగా తెలిసింది. లాప్‌టాప్‌లో స్లైడ్‌ని మార్చినప్పుడు చెయ్యి వణుకు కూడా గమనించాను. గబగబా మొత్తం పదిహేను నిమిషాల్లో ముగించానని నా ప్రొఫెసర్ "షీ ఈజ్ ద ఫాస్టెస్ట్" అన్నప్పుడు తెలుసుకున్నాను. కొంతమంది ప్రశ్నలు అడిగారు కానీ సులభంగానే సమాధానం చెప్పగలిగాను.

అదృష్టవసాత్తూ నాకు తెలీని ప్రశ్నలు అడగలేదు. చివరికి అందరూ చాలా బావుంది, గుడ్ జాబ్ అని అన్నారు. బహుశా నా ఇబ్బందిని కనిపెట్టి మానవత్వం కొద్దీ అలా అన్నారని సరిపెట్టుకున్నాను. వెంటనే లాబ్‌కి వెళ్ళి రెయిన్‌తో కొంచెం సేపు మాట్లాడి ఇంటికి వెళ్ళిపొయ్యాను. ఎంతో ప్రశాంతంగా అనిపించి నిద్రపోయాను. లేచాక హనీష, నేహ, వెన్నెల మెసేజెస్‌కి రిప్లై ఇచ్చి ప్రెజంటేషన్ బాగా జరిగిందని చెప్పాను. మిగిలిన రోజులు కూడా అలానే బిజీగా గడిచిపోయాయి. ఈలోగా హాలోవీన్ దగ్గరకొచ్చింది. నేను ఇండియాలో ఉన్నప్పుడు అన్నయ్య పంపిన ఫోటోలు చూసి చాలా నవ్వుకునేదాన్ని. ఇప్పుడు అందరూ దాని గురించి మాట్లాడ్డం మొదలైంది. అందరూ నువ్వు ఏం వేసుకుంటున్నావు అంటే నువ్వు ఎవరిలా రెడీ అవుతావు అని మాట్లాడుకున్నారు.

"ఐ విల్ బీ జస్టిస్ బీబర్" అని ఒకళ్ళు

"ఐ విల్ బీ వేంపైర్" అని మరొకరు.

"ఐ విల్ బీ రెఫ్రీ" అని, "కార్ప్స్ బ్రైడ్", "డిస్నీ ప్రిన్సెస్", "వెడ్నస్‌డే, "హారీపాటర్" అంటూ అందరూ చర్చించుకున్నారు.

నన్ను అడిగినప్పుడు "నాకు ఇష్టంలేదు" అని చెప్పాను.

బాగుంటుంది సరదాగా అని ఎంతమంది చెప్పినా "నో" అనే బదులిచ్చాను. హనీష తన పాత హాలోవీన్ ఫోటోలు చూపించింది. వెన్నెల, నేహ కూడా చాలా ప్రయత్నించారు.

నేహ తనంతట తానే నన్ను రెడీ చేస్తా అని చెప్పినా ఒప్పుకోలేదు.

"అందరూ తెగ విసిస్తిస్తున్నారు" అన్నయ్యతో అన్నాను.

"మరి ముసలమ్మలాగా ఉంటే అంతే చేస్తారు" అన్నాడు.

"ముసలమ్మ కాదు. నాకు చిరాకు" అన్నాను.

"ఎప్పుడైనా సెలబ్రేట్ చేసావా?"

"ఛీ..ఛీ. మరీ దెయ్యాల పండగలు కూడా జరుపుకోవాలా?"

"హాలోవీన్ అంటే దెయ్యాలకి పూజ చేస్తారా, లేక ప్రేతాత్మలని పిలుస్తారా?"

బదులివ్వలేదు.

"ఏ వయసుకి ఆ ముచ్చట. చక్కగా నీ ఫ్రెండ్స్‌తో సెలబ్రేట్ చేసుకో."

బదులివ్వలేదు.

"స్కీయింగ్‌కి ముందు ఇష్టంలేదన్నావు, హైకింగ్‌కి ముందు కూడా ఇష్టం లేదన్నావు. ఇదీ అంతే. ప్రయత్నించు. నచ్చిందా సరి. లేదా మళ్ళీ అడను."

"ఆ బట్టలు నాకు ఇష్టంలేదు. ఇబ్బదిగా ఉంటుంది" చిన్నగా చెప్పాను.

"అయితే నన్ బట్టలో, డాక్టర్  కోటో వేసుకో" అన్నాడు.

"కరెక్టేకానీ ఏమో?"

"ముందు స్కర్ట్ వేసుకోడానికి చాలా ఇబ్బంది పడ్డావు. తరవాత అలవాటైంది కదా ఇదీ అంతే."

బదులివ్వలేదు.

"చూడు. నీ ఇష్టం. అందరూ రెడీ అవుతూ, పార్టీ చేసుకుంటూ ఉంటే నువ్వు ఒక్కదానివే ఇంట్లో ఏం చేస్తావు?"

"సరే" అన్నాను

తరవాత చాలా రోజులు ఎలా రెడీ అవ్వాలి అని చర్చతో గడిచిపోయాయి.

"ఆస్ట్రొనట్, నర్స్, పైలెట్, డాక్టర్" అంటూ ఎన్నో సలహాలు ఇచ్చారు కానీ ఏదీ నచ్చలేదు. హాలోవీన్‌కి వారం ముందు సునీత ఇచ్చిన ఉపాయం ఒకటి నాకు నచ్చింది. సునీత, తన స్నేహితుడు గ్రూప్ కాస్ట్యూం వేసుకుందాం అనుకున్నారట కానీ అందరికీ నచ్చిన ఉపాయం "స్కూబీడూ" అయితే, వాళ్ళ ఫ్రెండ్స్‌లో ఒకరు తక్కువ అయ్యారట. ఆ అయిదో వ్యక్తిగా నన్ను చేరతావా అని అడిగింది. చిన్నప్పుడు ఎప్పుడో చూసాను గుర్తులేదని చెప్పాను.

'నిన్నెవవరూ నటించమనో డైలాగులు చెప్పమనో అనడంలేదు కేవలం అలాంటి బట్టలు వేసుకుంటే సరిపోతుంది' అనడంతో మొత్తానికి ఒప్పుకున్నాను. మాల్‌కి వెళ్ళి అందరం కాస్ట్యూం కొనుక్కున్నాము. నేను ఆరెంజ్ చొక్కా వేసుకునే వెళ్ళేలాగా తయారవుతున్నాను అని చెప్పాను. ఇంటికి వెళ్ళాక అందరూ గ్రూప్ చాట్‌లో  ఫోటోలు పంపడం మొదలు పెట్టారు కానీ నేను మాత్రం పంపలేదు. తరవాత ఈ విషయం నేహా, వెన్నెల, హనీషలకి చెప్పాను.

ముగ్గురూ ఫోటో ఉందా అని అడిగారు కానీ ఇంటికి వచ్చాక వేసుకోలేదు అని చెప్పాను. నేహ మాత్రం ఆ ఆర్గ్యుమెంట్‌లో గెలిచంది. సరే అని ఆ బట్టలు వేసుకుని అద్దంలో చూసాను. నేను అనుకున్నంత వికారంగాలేదు. చూసిన వెంటనే "వేర్ ఈజ్ ది విగ్?" అడిగింది నేహ.

నా జుట్టు పొట్టిగానే ఉంది, విగ్ అక్కరలేదని చెప్పాను. పట్టుబట్టి విగ్ పెట్టింది. ఇప్పుడు సరేకానీ పార్టీలో పెట్టుకోను అన్నాను. ఆశ్చర్యంగా చూసింది. ఉండిపోతే బావుండదు అనగానే పెద్దగా నవ్వింది.

ఎక్కువ తల ఆడించకపోతే ఏంకాదు, టోపీలానే ఉంటుంది, ఊడదు అని చెప్పింది. ప్రయత్నించేందుకు ఆ సాయంత్రమంతా విగ్‌తోనే ఉన్నాను. కొద్దిసేపటికి అలవాటైంది. వెంటనే ఫోటోలు తీసి గ్రూప్‌లో, హనీషకి, వెన్నెలకి పంపాను. అందరూ చాలా బావుంది అనడంతో అన్నయ్యకి కూడా పంపాను. చాలా బావుందని చెప్పాడు. దాంతో మనసు కుదుట పడింది.

శుక్రవారం సాయంత్రం నేహ మాటిచ్చినట్టే నేను తయారవడానికి సహాయపడింది. యధావిధిగా నేను వద్దన్నా బలవంతంగా మేకప్ వేసింది. మరీ కొట్టొచ్చినట్టు కనబడడంతో సునీతకి ఫోటో పంపి " ఐ వోంట్ కం" అన్నాను. వెంటనే తను నా గదికి వచ్చింది. స్కూబీడూలోని కాఫ్నీలాగా వంకాయ రంగు డ్రస్, విగ్, మేకప్‌లో వున్న సునీతని చూసి 'ఇలాగే వస్తావా?' అని అడగబోయాను. ఈలోగా నేహ 'బ్యూటిఫుల్' అనడంతో ఆశ్చర్యపోయాను. అందరూ ఇలానే ఉంటారు అని ఇద్దరూ అనడంతో మొత్తానికి పార్టీకి బయలుదేరాను.

వాళ్ళు చెప్పినట్టే అందరూ వింత వింతగా ఉన్నారు. కొంతమంది జోకర్ బట్టలు వేసుకుని రంగు రంగుల జుట్టుతో, కొందరు మొహానికి పెయింట్ వేసుకుని, కొందరు హిప్పీలాగా రెడీ అయితే, మరికొందరు జర్సీ వేసుకుని లేదా స్క్రబ్స్ వేసుకుని సాత్వికంగా ఉన్నారు. ఆ రాత్రి మొత్తం 'స్కూబీ డూ గాంగ్' కలిసే తిరిగాము. సునీత డాన్స్ చేసినప్పుడు నేను కాస్త దూరంలో ఉండడం వల్ల హనీష నన్ను లాగే ప్రయత్నం చేసింది కానీ విఫలమైంది. కొంతమంది విపరీతంగా తాగడం చూసి అనవసరంగా వచ్చానేమో, గొడవ అయ్యేలాఉంది అనుకున్నాను కానీ రాత్రంతా సరదాగా గడిచింది. దెయ్యాలలాగా తయారయినవారు మధ్యలో వచ్చి వెనకనుండి అరవడంలాంటి పనులు చేసారు. దాదాపు క్యాంపస్‌లో అందరూ అక్కడే ఉన్నారు. నేను రాకపోతే నిజంగానే మిస్ అయ్యేదాన్ననిపించి అన్నయ్యకి థ్యాంక్స్ మెసేజ్ పంపాను.

సందర్భం అర్ధమయ్యిందనుకుంటా, 'ఎనీ టైం' అని బదులిచ్చాడు. మేము స్కూబీడూ పోజులు ఇంటర్నెట్‌లో వెతికి రకరకాల ఫోటోలు తీసుకున్నాము. గాబ్లిన్‌లాగా తయారయిన ఒకరు మాతో ఫోటో తీసుకున్నారు. ఒకరు "ఆర్ యూ ఎ డిటెక్టివ్? " అంటే

"నో ఐయామ్ ఎ స్టూడెంట్ అన్నాను."

పైనుండి కిందకి చూసి వెళ్ళిపోయాడు. సునీత నవ్వుతూ "నా క్యారెక్టర్ డిటెక్టివ్. అదీ అడిగాడు" అంది. వెంటనే చిన్నబోయాను. తెలిసిన వారు, తెలీని వారు అందరూ స్నేహితుల్లా కలిసిపోయారు. ప్రతిరోజూ ఇలానే ఉంటే గొడవలు, గోలలు ఉండవుగా అనుకునే సమయానికి 'ఆఫ్టర్ పార్టీ' అన్నారు. తెలీకుండానే టైం ఒంటిగంట దాటడంతో నేను రానని రూముకి వెళ్ళిపోయాను. వెళ్ళిన పదినిమిషాలు నిద్రలోకి జారుకున్నాను.

*(కిందటి సంచికనుంచి కొనసాగింపు)*

Click here to share your comments on this story